అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 221. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ బుధవారం.21.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. ఈనెల 13 నుంచి 17 వరకు జిల్లాస్థాయి మొదటి విడత శిక్షణలో 17,771 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే రెండో విడతలో జిల్లా, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమంలో 89,378 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. మంగళవారం జూమ్ మీటింగ్ ద్వారా ఉపాధ్యాయులకు యోగితారాణా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మీద నమ్మకం కలిగేలా ప్రతి ఉపాధ్యాయుడూ తమ బోధనా పద్ధతులను కాలానికనుగుణంగా మార్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేసి రాష్ట్రాన్ని విద్యా ప్రమాణాల పరంగా ముందువరుసలో నిలబెడతారనే నమ్మకం, విశ్వాసం ఉందని వివరించారు.

## నలుగురు మయన్మార్ దేశస్తుల అరెస్ట్

హయత్‌నగర్ : అమృత్ తెలంగాణ: భారత్‌లోకి చొరబడి అక్రమంగా నివాసముంటున్న నలుగురు మయన్మార్ దేశస్తులను ఎల్బీనగర్ మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్ దేశానికి చెందిన మహమ్మద్ అర్మాన్ అలియాస్ సయ్యద్ ఉల్ అమీన్, మహమ్మద్ రుమానా అకేథర్ అలియాస్ ముస్తాకియా, మహమ్మద్ నయీమ్ అలియాస్ హెరల్ అమిన్, మహమ్మద్ హారీస్ అలియాస్ మహమ్మద్ రిజ్వాన్, అయాజ్, సోయబ్ మాలిక్ పెద్ద అంబర్‌పేటలో నివాసముంటున్నారు. 2011లో మయన్మార్ సరిహద్దు నుంచి వీరంతా భారత్‌లోకి ప్రవేశించారు. తర్వాత 2014లో వీరంతా అక్రమంగా ఆధార్ కార్డులు పొందారు. అలాగే పాన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఖాతాలు, ఏటీఎంలు, గ్యాస్ పాస్ బుక్కులు పొందారు.

# మెట్రో రైల్ సంస్థ కీలక నిర్ణయం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఇటీవల పెంచిన మెట్రో రైలు చార్జీలపై ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ వర్గాల ప్రజలు, సీపీఐ(ఎం), ఇతర వామపక్ష పార్టీల ఆందోళన లతో పాటు ప్రజాసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో పెంచిన చార్జీలపై 10శాతం డిస్కౌంట్ ప్రకటించింది. మూడు మెట్రో కారిడార్లలోని అన్ని జోన్లలో కొత్తగా సవరించిన చార్జీలపై ఈ డిస్కౌంట్ వర్తించనుంది. ఈ డిస్కౌంట్ చార్జీలు ఈనెల 24 నుంచి అమల్లోకి రానున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ(ఎఫ్‌ఎఫ్‌సీ) సిఫారసుల మేరకే చార్జీలను పెంచినట్టు తెలిపింది. ఈ మేరకు ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్ సీఎండీ కేవీబీ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలంలో మెట్రో కార్యకలాపాలను సుస్థిరంగా నిర్వహించుకోగలిగేందుకు ఉద్దేశించిన సమగ్ర వ్యూహంలో భాగంగా చార్జీలు సవరించినట్టు తెలిపారు. ఆర్థికంగా దూరదృష్టితో వ్యవహరిస్తూ, ప్రయాణికులకు అందుబాటు స్థాయిలో సేవలు అందించాలన్న సంస్థ నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మెట్రో కార్యకలాపాలను నిలకడగా కొనసాగించేందుకు చార్జీలను సవరించక తప్పలేదని, అయినప్పటికీ ప్రయాణికులపై ఆర్థిక భారం పడనివ్వకుండా చూడడానికే అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్, వారి వెసులుబాటు మేరకు కొత్తగా సవరించిన చార్జీలపై పది శాతం డిస్కౌంట్ ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నామని, అందుబాటు చార్జీల్లో రోజువారీ ప్రయాణాలకు వీలు కల్పించాలన్న తమ చిత్తశుద్ధికి ఇది నిదర్శనంగా నిలుస్తుందని కేవీబీ రెడ్డి వివరించారు.

ఈనెల 24 నుంచి మూడు మెట్రో కారిడార్లలోని అన్ని జోన్‌లో పెంచిన చార్జీలపై ఈ డిస్కౌంట్ అమల్లోకి వస్తుందన్నారు. సవరించిన చార్జీలు, ఇతర అప్‌డేట్‌ల సమగ్ర సమాచారం కోసం ప్రయాణికులు తమ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎల్‌టీమెట్రో.కామ్‌ను సందర్శించగలరని విజ్ఞప్తి చేశారు. కాగా ఇటీవల ఎల్అండ్‌టీ మెట్రో సంస్థ కనీస చార్జి రూ.10 నుంచి 12కు, గరిష్ట చార్జి రూ.60 నుంచి 75కు పెంచిన విషయం తెలిసిందే.

# విచారణకు హాజరుకండి మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులిచ్చింది. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కూ నోటీసులను జారీ చేసింది. 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకల్కటు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పని చేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్‌ను జూన్ 9న విచారణకు హాజరు కావాలని పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో దీంతో పాటు అన్నారం,




సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీకంట్రోల్, పే అండ్ అకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఇలా అందరినీ ఇప్పటికే విచారించింది.

కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

# భూభారతి రైతులకు అంకితం




ఎలిగేడు/ జైపూర్ : అమృత్ తెలంగాణ: శాశ్వత భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'భూభారతి (ఆర్ఓఆర్)' చట్టాన్ని తీసుకొచ్చి రైతులకు అంకితం చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో, మంచి ర్యాల జిల్లా భీమారంలో మంగళవారం భూభారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ముందుగా ముప్పిరితోటలో మంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల రైతుల సమస్యలు పెరిగి, కుటుంబాల్లో వివాదాలకు దారి తీశాయని అన్నారు. సాదాబైనామా అంశాన్ని ధరణిలో చేర్చకపోవడం వల్ల భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు రైతులు తిరగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు, మేధావులు, ప్రజలతో చర్చించి అందరూ కోరుకున్న విధంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి పలు మండలాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించామని చెప్పారు. ఈ చట్టంలో రైతులకు అన్ని హక్కులూ కల్పిస్తూ జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్టు వెల్లడించారు. రైతుల దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో భూము లను సర్వే చేయడానికి రాష్ట్రంలో 6,000 మంది ప్రయివేటు సర్వేయర్లను ఎంపిక చేసి వారం రోజుల్లో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ప్రతి రెవె న్యూ కార్యాలయంలో డిసెంబర్ 31న జమాబందీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు.

సాగునీరు అందించేందుకు కృషి : మంత్రి శ్రీధర్‌బాబు

జిల్లాలోని రైతులకు సాగునీరు అందించేం దుకు కృషి చేస్తానని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కొదురుపాక రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు వెచ్చించామని, టెండర్లు కూడా పూర్తయ్యాయని చెప్పారు. బీజేపీ దేశంలో తప్పుడు ప్రచారాల కోసం వాట్సాప్ యూనివర్సిటీని ఏర్పాటు చేసు కుందని విమర్శించారు. వరి ధాన్యం కొనుగోలులో గత ప్రభుత్వం 2022-23లో రూ.290 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.700 కోట్లు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు చేసిందని వివరించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు చెక్కులు, రైతులకు భూభారతి ప్రొసీడింగ్‌లను మంత్రులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాదరావు, సలహాదారు వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ అన్నయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఫారెస్టు వివాదాలకు పరిష్కారం..

భూభారతి-2025 చట్టం ద్వారా భూసమస్య లకు శాశ్వత పరిష్కారం చూపించనున్నామని మంచిర్యాల జిల్లా భీమారం సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 18 రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేసి భూభారతి చట్టం తీసుకొచ్చినట్టు తెలిపారు. వంద రోజుల్లో ఈ చట్టం ద్వారా భూసమస్యలకు పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4 జిల్లాల్లో 4 మండలాలను పైలెట్ ప్రాజెక్టులుగా గుర్తించి అవగాహన కల్పిసున్నట్టు తెలిపారు. భీమారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు గా గుర్తించి భూసమస్యల పరిష్కారం కోసం ఇప్పటి వరకు 2200 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు వెల్లడించారు. ఇందులో 1100 దరఖాస్తులు ఉన్నట్టు తెలిపారు. సాదాబైనామా అంశంలో కోర్టులో స్టే ఉన్నందున అతి త్వరలో ఈ సమస్యలను కూడా పరిష్కరించుకుందామన్నారు. ఈ ప్రాంత రైతులు చెప్పినట్టు ఫారెస్ట్ వివాదం, ప్రభుత్వ భూముల ఇబ్బందులను పరిష్కరించేం దుకు కలెక్టర్‌కు ఆదేశాలిస్తున్నట్టు ప్రకటించారు. సదస్సులో ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్ పాల్గొన్నారు.

# పదవే పరమావధి!




భోపాల్:అమృత్ తెలంగాణ: సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీని లక్ష్యంగా చేసుకొని అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షాపై న్యాయస్థానాలు ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ ఆయన పదవి నుండి వైదొలగడం లేదు. మతపరమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా షా క్షమాపణను తోసిపుచ్చుతూ విచారణ జరపాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. సిట్ విచారణకు ఆదేశించింది. అయినప్పటికీ ఆయన పదవే పరమావధిగా భావిస్తూ దానిని పట్టుకొని వేలాడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఉమాభారతి సహా పలువురు బీజేపీ నాయకులు విజయ్ షా తప్పిదాన్ని వేలెత్తి చూపినప్పటికీ పార్టీ నాయకత్వం ఆయన వ్యాఖ్యలను ఖండించడం కానీ, ఆయన రాజీనామాను కోరడం కానీ జరగలేదు. పార్టీలో అంతర్గత జవాబుదారీతనం లోపించిన విషయాన్ని ఈ ఉదంతం బయటపెడుతోంది.ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాత్రం షాను వెనకేసుకొస్తూ వితండవాదం చేస్తున్నారు. నిందను కాంగ్రెస్ పైకి నెట్టి కోర్టు ఆదేశాలను తమ ప్రభుత్వం పాటించిందని తెలిపారు. విద్వేష ధోరణికి వ్యతిరేకంగా న్యాయ వ్యవస్థ సైతం చర్యకు ఉపక్రమించినప్పుడు రాజకీయ నాయకత్వం ఎందుకు మౌనంగా ఉంటోంది? ఈ నెల 12న జరిగిన ఓ బహిరంగ సభలో కల్నల్ సోఫియా ఖురేషీని ఉగ్రవాదుల సోదరిగా షా అభివర్ణించారు. ఆమె ముస్లిం గుర్తింపును ఉగ్రవాదంతో ముడిపెట్టారు. ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా తిరంగ యాత్రలు చేపట్టిన బీజేపీ అదే సమయంలో సైనికాధికారిపై మతపరమైన వ్యాఖ్యలు చేసిన మంత్రిని రక్షిస్తోంది. విజయ్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ నెల 14న ఆదేశాలు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు వెలువడిన గంటల వ్యవధిలోనే ఇండోర్‌లోని మన్పూర్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహితలోని 152, 196 (1) (బీ), 197 (1) (సీ) సెక్షన్ల ప్రకారం షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పిన విజయ్ షా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని తెలుస్తోంది. ఆయన ఎక్కడ ఉన్నదీ తెలియడం లేదు. ద్వేషపూరిత ప్రసంగాలపై కేసులు నమోదు చేయాలని 2023 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలనూ ఆదేశించింది. తన ఆదేశాలను పాటించని పక్షంలో కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటానని హెచ్చరిం చింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో విద్వేష ప్రసంగాల కేసులు అత్యధిక సంఖ్యలో నమోదైనప్పటికీ అనేక మంది నాయకులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. 'షా చేసింది ద్వేషపూరిత ప్రసంగం కాదు. అది సైన్యంపై జరిగిన ప్రత్యక్ష దాడి. మతపరమైన దూషణలకు మించి జాతీయ స్థాయిలో ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో చెప్పింది. కానీ ఏమీ జరగడం లేదు' అని న్యాయవాది ప్రత్యూష్ మిశ్రా చెప్పారు. విజయ్ షా వివాదాన్ని రేకెత్తించడం ఇదేమీ మొదటిసారి కాదు. 2013లో శివరాజ్ సింగ్ చౌహాన్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్న సమయంలో చౌహాన్ తన భార్య సాధనా సింగ్‌ను ఉద్దేశించి లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. దీనిపై రచ్చ జరగడంతో ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే నెలల వ్యవధిలోనే మళ్లీ మంత్రి పదవి పొందారు. విజయ్ షా శక్తివంతమైన గిరిజన నాయకుడు. ఆయన 1990 నుండి హర్సద్ శాసనసభ స్థానానికి ప్రతినిధ్యం వహిస్తున్నారు. అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. కాబట్టి ఆయనపై బీజేపీ నాయకత్వం చర్య తీసుకోక పోవచ్చు. ఇదిలావుండగా రెండు రోజుల క్రితం కాంగ్రెస్ కార్యకర్తలు రాజ్‌భవన్ వెలుపల నల్లని యూనిఫామ్ ధరించి షా రాజీనామాను డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారిపై దాడి కూడా చేశారు.

# గోదాములు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం చేపట్టాలి

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: నాబార్డ్, ఆర్ఐడీఎఫ్ నిధులతో గోదాములు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణాన్ని చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మార్కెటింగ్, ఆయిల్‌ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఉనికిలో ఉన్న గోదాములు, కోల్డ్ స్టోరేజీల సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు మాత్రమే తమ ఉత్పత్తులను అమ్ముకునేలా రైతుబజార్లను తీర్చిదిద్దాలని కోరారు. అందుకోసం అన్ని మార్కెట్లు, రైతు బజార్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్లలో డిజిటల్ బోర్డుల ఏర్పాటుపై చేయాలన్నారు. రైతులకు సరిపడిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. మే నెలాఖరు వరకు 2 లక్షల మట్టి నమూనాల సేకరించడం పూర్తి చేయాలని కోరారు. వాటి ఫలితాలను రెండు నెలలలోపు రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జొన్నల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సహకార అడిషనల్ రిజిస్ట్రార్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయండి :కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ

ఏప్రిల్, మే రెండు నెలలకు రాష్ట్రానికి కేటాయించిన యూరియాను పూర్తి స్థాయిలో



ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల మంత్రి జేపీ నడ్డాను కోరారు. ఈమేరకు మంగళవారం ఆయనకు తుమ్మల లేఖ రాశారు. ఈ వానాకాలానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిందని తెలిపారు. దానిలో భాగంగా ఏప్రిల్ నెలకు 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, మే మాసానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించారనీ, వాటిని పూర్తి స్థాయిలో విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# అండర్‌గ్రౌండ్ విద్యుత్ సరఫరాపై అధ్యయనం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యయనం చేస్తున్నారు. దానిలో భాగంగా మంగళవారంనాడాయన బెంగళూరులోని అండర్ గ్రౌండ్ విద్యుత్‌లైన్ల వ్యవస్థను పరిశీలించారు. కర్ణాటక పవర్ ట్రాన్సిమిషన్ కార్పొరేషన్ లిమిటెడ్, , బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లరు కంపెనీ లిమిటెడ్ అధికారులతో కలిసి ఈ ప్రాజెక్టుపై చర్చలు జరిపారు. క్షేత్రస్థాయిలో పనితీరును పర్యవేక్షించారు. బ్యాంకు రుణాలు, సాంకేతిక సమస్యలు, నష్టాలు, లాభాలు, ప్రమాదాలు తదితర అంశాలపై స్థానిక ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా సంస్థల ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఆ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పంకజ్‌పాండే తదితరులు ఈ సమీక్షను నిర్వహించారు. టీజీట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ తదితరులు కూడా పాల్గొన్నారు. బెంగళూరులో 2018-19లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 7,400 కిలోమీటర్ల 11 కేవీ ఓవర్‌హెడ్ లైన్లను ఏర్పాటు చేసినట్టు అక్కడి అధికారులు తెలిపారు. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ డక్టులను ప్రాధాన్యత, భవిష్యత్‌లో టెలికం కంపెనీలతో లీజు ద్వారా వచ్చే ఆదాయ మార్గాలను వివరించారు.

# రాజ్‌భవన్ నుంచి హార్డ్ డిస్క్ మాత్రమే పోయింది

బంజారాహిల్స్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి హార్డ్ డిస్క్ మాత్రమే నిందితుడు దొంగిలించాడని, అక్కడ ఇతర ఏ వస్తువూ పోలేదని పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ తెలిపారు. రాజ్‌భవన్‌లో హార్డ్‌డిస్క్ చోరీ కేసుకు సంబంధించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బయటి వ్యక్తులు వచ్చి రాజ్‌భవన్‌లో దొంగతనం చేశారని, రాజ్ భవన్‌కు సంబంధించిన కీలక విషయాలు ఉన్న డాక్యుమెంట్స్ పోయాయని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. అయితే, చోరీ కేసులో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. రాజ్‌భవన్‌లో పనిచేసే ఉద్యోగే హార్డ్ డిస్క్‌ను దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. రాజ్‌భవన్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో టి.శ్రీనివాస్ అనే వ్యక్తి హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అతను ఓ మహిళా ఉద్యోగిని ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేశారని ఆరోపణలు రావడంతో అధికారులు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో విచారణ చేపట్టిన పోలీసులు శ్రీనివాస్‌ను ఈ నెల 12న అరెస్టు చేసి




రిమాండ్‌కు తరలించారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగా అతన్ని విధుల నుంచి రాజ్‌భవన్ అధికారులు సస్పెండ్ చేశారు. అయితే రెండ్రోజుల్లోనే శ్రీనివాస్ బెయిల్‌పై బయటకు వచ్చాడు.

ఇదిలా ఉండగా, ఇటీవల రాజ్ భవన్ ప్రాంగణంలోని సుదర్శన భవన్‌లో హార్డ్ డిస్క్ మాయమైంది. ఈ వ్యవహారంపై ఈనెల 14న రాజ్‌భవన్ ఐటీ మేనేజర్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి హెల్మెట్ ధరించి కంప్యూటర్ రూంలోకి ప్రవేశించినట్టు గుర్తించారు.

# ఆదిలాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సామ రూపేష్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సామ రుపేష్ రెడ్డికి జన్మదిన సందర్భంగా కేక్ తిన పెడుతున్న తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి




సమ రూపేష్ రెడ్డి జన్మదిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ బేల న్యూస్ బేల మండలకేంద్రంలోని సదల్పూర్ రోడ్ లో గల AN గార్డెన్ లో నిర్వహించిన జన్మదిన వేడుకలకు ఆదిలాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ , పాల్గొని జన్మదిన వేడుకలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు, అయన అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో బేలా మండల అధ్యక్షులు ఫైజుల ఖాన్, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ రామ్ దాస్ , మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, రవ్ రావు, వామన్ వాకడే, బాపూరావు ఉల్కె, అఖిల్, నలిమేల నవీన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, కృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యాల్లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన శిరీష – కార్తీక్ స్వామి ల వివాహానికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క, ఏఐసీసీ మెంబర్ నరేష్ జాదవ్తో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశిర్వదించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అనంతరం బేల మండలంలోని గణేష్ గార్డెన్ లో జరిగిన అశ్విత – అవినాష్ ల వివాహానికి హాజరై వారికి అభినందనలు తెలపడం జరిగింది. అనంతరం ఇంద్రవెల్లి మండలం పిప్పిరి గ్రామంలో జరిగిన వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారివెంట మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సునీల్, నలిమేల నవీన్ రెడ్డి, ఫెరోజ్ ఖాన్ గోవిండ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బోధనలో మార్పులు అవసరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



హాజరైన ఉపాధ్యాయులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిది : లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ హై స్కూల్ లో మంగళవారం ఉపాధ్యాయులకు 5 రోజుల మండల లెవెల్ శిక్షణ (జైనథ్ మండలం ) కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని పలు సూచనలు సలహాలు చేశారు. మంగళవారం పట్టణం లోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు, భోధన నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, జీవన నైపుణ్యాల పెంపు కొరకై 5 రోజుల మండల స్థాయి వృత్తంతర శిక్షణా లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణలో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు . ఈ సందర్భంగా గుణాత్మక విద్య నైపుణ్యత శిక్షణా తరగతులు,వృత్యంతర శిక్షణను వినియోగించుకోవాలని జిల్లా పాలనాధికారి ఉపాధ్యాయులను కోరారు. రాష్ట్ర స్థాయిలో పొందిన శిక్షణను తరగతి గదికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందనే విషయాన్ని తెలియజేస్తూ ఉపాధ్యాయులంతా తరగతి గదికి నిత్య నూతనంగా వెళ్లాలని సూచించారు. విద్యార్థుల నమోదుతో పాటు గుణాత్మక విద్యలో సమూల మార్పులు తెచ్చి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. మార్పుల కనుగుణంగా ఉపాధ్యాయులు నూతన విధానం లో భోధన చేయాలని అన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రేరణాత్మక సందేశాన్ని , పాటల రూపం లో ప్రదర్శించిన తీరును మెచ్చుకున్నారు.

ఈ రోజు 20 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు 5 రోజులపాటు సాగే ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్ ల ద్వారా మండల లెవెల్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న ప్రతిభా పాఠవాలను విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. గుణాత్మక విద్య శిక్షణ ద్వారా విద్యార్థులకు తరగతి గదుల్లో అభ్యాసన భయం పోగొట్టి మరింత ప్రతిభ, ఫలితాలు సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు 5 రోజుల శిక్షణను శ్రద్ధతో విని అన్ని అంశాలపై పట్టు సాధించాలని, అవగాహన చేసుకొని విద్యార్థులకు మెరుగైన విద్య ను అందించాలని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో గత 3 సంవత్సరాల నుండి ఇంగ్లీష్ పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నదని, ప్రతీ ఒక్కరూ ఇంగ్లీష్ లో ప్రతీ సబ్జెక్టు పై ప్రావీణ్యం పొంది విద్యార్థులకు బోధన చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా భవిత సెంటర్, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆంగ్ల భాష,గణితం సబ్జక్ట్ పై విద్యార్థులకు మక్కువ పెంచేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లో లెర్నింగ్ లెవెల్ పెంపొందించాలని ప్రత్యేక తరగతులు తీసుకోవాలని తెలిపారు. ఇంగ్లీష్, EVS సబ్జెక్టులను ఇంగ్లీష్ లోనే ఉపాధ్యాయులు బోధించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో AI ప్రారంభించడం జరుగుతుందని వెనుకబడిన పిల్లల పై ప్రత్యేక దృష్టి సారించి మంచి విద్యను అందించేందుకు కృషి చేయాలని తెలిపారు.ల అలాగే ఈ ఏడాది అప్పర్ ప్రైమరీ స్కూల్ నుండే ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్,సుజిత్ ఖాన్, ప్రోగ్రాం అధికారులు, రిసోర్స్ పర్సన్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# షీ టీం స్పెషల్ ఆపరేషన్.

**బాధితురాలు ఫిర్యాదు తో తన స్నేహితురాలు గా వెళ్లి రెడ్ హ్యాండెడ్ గా నిందితుని పట్టుకోవడం జరిగింది.**
**అమ్మాయిలను వారికి తెలియకుండా ఫోటోలు తీస్తూ,వారిని వెంబడించిన వ్యక్తి అరెస్ట్.**
**ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ షీ టీం బృందం 24 గంటలు అప్రమత్తమై విధులను నిర్వర్తిస్తుందని అందులో భాగంగానే, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహిళ తనని బస్ స్టాప్ నందు ఒక యువకుడు వెంబడిస్తున్నాడని కారణంతో ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించగా షీ టీం బృంద సభ్యులు తనతో తన మిత్రులుగా వెళ్లి స్పెషల్ ఆపరేషన్ చేసి నిందితుడైనటువంటి కత్తుల్వార్ వేణు s/o లింగన్న మెకానిక్ వృత్తి నిర్వహిస్తూ శాంతినగర్ నందు నివసిస్తున్న వ్యక్తిని రెడ్ హ్యాండెడ్ గా సంఘటన స్థలంలో ఫోటోలు తీస్తూ పట్టుబడ్డాడని షీ టీం బృంద సభ్యులు శ్రీవాణి తెలియజేశారు. వివరాలలో నిందితుడు అమ్మాయిల ఫోటోలను వారికి తెలియకుండా తీస్తూ ఫోన్ నందు ఉంచుకుంటున్న విషయాన్ని తన ఫోన్ చేసి విచారించగా తెలిసిందని తెలిపారు. నిందితునిపై షీ టీం ఫిర్యాదు చేయగా ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 251/2025 తో అండర్ సెక్షన్ 78(2) ఎఫ్ బి ఎన్ ఎస్ మరియు 67 ఆఫ్ ఐ టి యాక్ట్ తో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఆదిలాబాద్ రెండవ పట్టణ సీఐ సిహెచ్ కరుణాకర రావు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళలు యువతులకు విద్యార్థినులకు ఆదిలాబాద్ షీ టీం బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందని ఎలాంటి సహాయం కైనా 8712659953 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు. షి టీం అప్రమత్తంగా ఉంటూ క్షణాల వ్యవధిలో బాధితులకు అండగా ఉంటుందని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతూ వారి సమస్యలను పరిష్కరించబడతాయని తెలిపారు.

# సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని ప్లాస్టిక్ తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, ఇది మానవాళి ఆరోగ్యానికి మాత్రమే కాకుండా ఇతర జీవరాశులకు కూడా ముప్పుగా మారిందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళా స్వయం సహాయక సంఘాల సహకారంతో ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పంచాయతీ స్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి అనుగుణంగా తీర్మానాలు చేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువులను వేరుగా సేకరించి సెగ్రిగేషన్ చేయాలని, కలెక్టరేట్‌లో ఇప్పటికే స్టీల్ నీళ్ల సీసాలను వినియోగంలోకి తీసుకొచ్చామని వివరించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల తయారీ, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘించిన వారికి జరిమానాలు, వ్యాపార లైసెన్సులను రద్దు చేయడం సహా చట్టపరమైన చర్యలకు వెనుకాడరాదని అధికారులను హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్న సంస్థలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామ సభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచాలని అన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్, పేపర్ సంచుల తయారీ కేంద్రాలను మహిళా సంఘాలచే ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుద్ధ నిర్వహణను మెరుగుపరచాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు రత్నాకళ్యాణి, కోమల్ రెడ్డి, జడ్పి సి ఈ ఓ గోవింద్, డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, డిపి ఓశ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, ఎంపీ డివో లు, తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ రిటైలర్ శిక్షణ కార్యక్రమంలో POS పరికరాలు, స్టాక్ లిక్విడిటేశన్ వినియోగం లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా.



సమావేశానికి హాజరైన డీలర్స్







పి ఓ ఎస్ పరికరాలు జిల్లా పాలన అధికారి అందజేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : కొత్త L1 ePOS యంత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, ఎరువుల డీలర్లకు యంత్రాల పంపిణీ చేయటం జరిగింది. నేషనల్ ఫెర్టిలైజర్ కంపెనీ ద్వారా జిల్లాలోని ఎరువుల డీలర్లకు ఈ యంత్రాలను అందించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీలర్సనుద్దేశించిమాట్లాడుతూ డీలర్లు అందరూ రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలియజేశారు. బ్లాక్ మార్కెటింగ్ చేయటం, ఇతర రాష్ట్రాల వారికి అమ్మటం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకోవట0 జరుగుతుందని, ePOS యంత్రాల ద్వారా ఎరువుల అమ్మకాలు చేస్తూ, రోజు వారిగా రికార్డ్స్ అప్డేట్ చేసుకోవాలన్నారు. నిషేధించబడిన mixture ఎరువులు, Bt-3 లేదా కలుపు మందును తట్టుకునే పత్తి విత్తనలను అమ్మడానికి వీలు లేదని స్పష్టం చేశారు. డీలర్లు దుకాణాల వద్ద స్టాక్ వివరాలు task force సభ్యుల వివరాలు ప్రదర్శించాలని అన్నారు. కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి G Sridhar Swamy, ADA ఇచ్చోడ Ram Kishan, సాంకేతిక వ్యవసాయ అధికారి విశ్వామిత్ర, నేషనల్ ఫెర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు వంశీ కృష్ణ, మారుతి, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

# కూలీలను ముంచే లేబర్ కోర్డులు వెనక్కి తీసుకోవాలి




భిక్కనూర్ : అమృత్ తెలంగాణ: కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలను నిండముంచే కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్డు లను వెనక్కి తీసుకోవాలి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు అన్నారు. పట్టణ కేంద్రంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్ శివప్రసాద్ కు నాలుగు లేబర్ కోర్డ్ లను వెనక్కి తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోర్డు ల ద్వారా ఈ దేశంలో ఉన్న కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, తమ సమస్యల కోసం మాట్లాడడానికి, సమ్మెకు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేసే ఎటువంటి హక్కులు లేకుండా పోతుందన్నారు. ప్రధానంగా భారతదేశంలో ఉన్న వ్యవసాయ రంగం మీద తీవ్రమైన ప్రభావం ఉంటుందన్నారు. మన రైతులు పండించే పంటను కొనే పరిస్థితి, అమ్ముకునే పరిస్థితి, టమాటాను తినే పరిస్థితి ఉండదన్నారు. ప్రమాదకరమైన చట్టాలకు వ్యతిరేకంగా దేశంలో పెద్ద ఎత్తున రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపడితే తాత్కాలికంగా వాయిదా వేసినప్పటికీ మళ్లీ అమలు చేస్తున్నారని విమర్శించారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

మోపాల్ :అమృత్ తెలంగాణ: నిజామాబాద్ రూరల్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి పంపిణీ చేశారు. మోపాల్ మండలానికి సంబంధించిన 25 చెక్కులను మండల అధ్యక్షుడు ఎల్లోల్లా సాయి రెడ్డితో కలిసి లబ్దిదారలకు అందజేశారు. రూరల్ నియోజకవర్గం లోని అన్ని మండలాలు కలిపి 208 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే మళ్లీ ఇందిరమ్మ రాజ్యం ఆరంభమైందని, గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు కొనసాగుతూనే, సంక్షేమ ఫలాలు ప్రతి నిరుపేదకు అందుతున్నాయని, కాంగ్రెస్ పార్టీకి దాచుకోవడం దోచుకోవడం తెలియదని, పేద వాళ్లకు న్యాయం చేయడమే తమ కర్తవ్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఇది రైతన్నల రాజ్యం అని ఆయన కొనియాడారు. ధరణిని బంగాళాఖాతంలో కలిపేసామని భూభారతి ద్వారా గత ప్రభుత్వం చేసిన అవినీతి లెక్కలన్నీ బయటకు తీస్తామని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత పాద ప్రభుత్వాన్ని ఇంకా వారి బుద్ధి మారడం లేదని ఆయన బిఆర్ఎస్ ప్రభుత్వం పై మండిపడ్డాడు. ఈ కార్యక్రమంలో జలంధర్ రెడ్డి, నవీన్ గౌడ్, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కమ్యూనిటీ మధ్యర్తిత్వం - గ్రామ స్థాయిలో న్యాయ సాధనకు ముందడుగు...



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జూన్ 14 న అన్ని న్యాయ స్థానాలలో జరగబోవు జాతీయ లోక్ అదాలత్ గురించి జిల్లా పోలీస్ అధికారులతో ఆన్లైన్ లో సమీక్ష సమావేశం నిర్వహించిన .. జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐ.పి.యస్. Community Mediation మరియు లోక్ అదాలత్ ల గురించి ఈ రోజు సాయత్రం జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయం లో జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం ఆన్లైన్ లో నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్. గ్రామ స్థాయిలో కమ్యూనిటీ మధ్యర్తిత్వం (Community Mediation) అనే కొత్త కార్యక్రమం పై చర్చ జరిగింది. సమావేశంలో, మధ్యస్థులుగా ఎంపికయ్యే వారు సమాజానికి సేవ చేసిన, మంచి పేరు గల, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న వ్యక్తులు కావాలనేది ముఖ్య ఉద్దేశ్యం. వీరిలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, గ్రామ పెద్దలు వంటి వారు ఉండవచ్చు. ప్రజలను న్యాయ పరిష్కార ప్రక్రియలో భాగం చేయడం ద్వారా, మన గ్రామాల్లో శాంతియుత, సమగ్ర వాతావరణం ఏర్పడుతుంది. తరువాత జూన్ 14 న జరుగబోవు జాతీయ లోక్ అదాలత్ దృష్టిలో ఉంచుకుని , ఇప్పటివరకు లోక్ అదాలత్ లో పరిష్కరించిన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఇట్టి సమావేశం లో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్ ఐపిఎస్, రాజేష్ మీన ఐపిఎస్, ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# అభ్యాస సామర్థ్యాల పెంపునకే ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ



జన్నారం : అమృత్ తెలంగాణ:విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచడానికే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని కోర్సు డైరెక్టర్ ఎంఈఓ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జన్నారంలోని బాలికల జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలని మరింత మెరుగుపరచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని, జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పిట్టల రాజారావు జాజాల శ్రీనివాస్ సాత్పడి నరసయ్య శెట్టిపల్లి వామన్ కుమార్ కస్తూరి శ్రీకాంత్ శ్రీధర్ సీమల శ్రీనివాస్ ఉపాధ్యాయులకి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరూ అన్ని అంశాలను విపులంగా నేర్చుకొని రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులందరూ చక్కగా చదివేటట్లుగా రాసేటట్లుగా చేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 9:30 కు ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుంది. శిక్షణ పొందే ఉపాధ్యాయులు తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు.

# అక్రమ కేసులు పెట్టడం పై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో లేదు



జన్నారం :అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పై అక్రమ కేసులు పెట్టడం పై ఉన్న శ్రద్ధ, ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో లేదని బి ఆర్ఎస్ జన్నారం మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరులతో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు గడిచినా ఎన్నికల హామీలు అమలు చేయడం లేదన్నారు. 17 నెలల క్రితం జరిగిన ఘటన లో జాన్సన్ నాయక్ పై ఇప్పుడు కేసు నమోదు చేయడం కక్ష్య సాధింపు చర్య అన్నారు. అధికార పార్టీ నాయకులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక అబద్ధపు హామీలు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ద్వారా తులం బంగారం. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్, నిరుద్యోగులకు నెలకు రూ. 4,000 భృతి, ఇలా అనేక అబద్ధపు 420 హామీలు ఇచ్చి మర్చిపోయారన్నారు. ఒకవైపు వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతు కష్టం నీరుగారి పోతున్న నష్టపోయిన రైతుల కోసం ప్రభుత్వ పక్షాన కనీసం పంట నష్ట పరిహారంపై దృష్టి పెట్టకుండా అన్నం పెట్టే రైతన్నకు కనీసం భరోసా కల్పించడం మరచిపోతున్న అధికార నాయకులు అప్పుడెప్పుడో అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్దేశ్యపూర్వకంగా గొడవ చేసిన సంఘటనను ఇప్పుడు 17నెలల గడిచిన తరువాత మా నాయకునిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల్లో ఓడిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలకై స్పందిస్తూన్న జాన్సన్ నాయక్ పై పెట్టిన అక్రమ కేసుపై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఇచ్చిన హామీలపై పెడితే బాగుంటుందన్నారు. ఇది కేవలం కక్ష్య సాధింపు చర్య అని ఇలాంటి కేసులు నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులపైన పెట్టుకున్న మా పార్టీ నాయకుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతియలేరన్నారు. డిల్లీ మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించినా గులాబీ శ్రేణుల ఉద్యమ స్ఫూర్తిని అధికార పార్టీ నాయకులు మర్చిపోవద్దని హెచ్చరించారు. మా నాయకుడు కేసీఆర్ కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ పక్షాన భూక్యా జాన్సన్ నాయక్ నాయకత్వంలో ఇంతకంటే రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సమస్యలకే ప్రజాక్షేత్రంలో ఎప్పటికప్పుడు అధికార పార్టీపై ఉద్యమిస్తూనే ఉంటామన్నారు. రాబోయే రోజుల్లో ఖచ్చితంగా నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా పాలనా పేరిట పోలీసులను అడ్డం పెట్టుకొని కేసులు నమోదు చేస్తూ కక్షపూరిత రాజకీయాలు చేస్తూన్న వారు ఎంతటి వారైనా తగిన బుద్ధి చెప్తామన్నారు.ఇప్పటికైనా అక్రమ కేసులపై ఉన్న శ్రద్ధ ఇచ్చిన హామీలపై పెట్టి ప్రజల మన్ననలు పొందాలని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్ మండల మాజీ అధ్యక్షులు భరత్ కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, నాయకులు ఫజల్ ఖాన్, కే ఏ నరసింహులు బోర్లకుంట ప్రభుదాస్, నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయనీ ప్రసాద్ నేత, కొండకూరి ప్రభుదాస్ భరత్ నాయ క్, రెడ్డి భూతం శ్రీనివాస్, కందుకూరి స్వామి రవి ముదిరాజ్, సాయి,మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు సర్పంచులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ కీలక పాత్ర..




వేములవాడ : అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రజతోత్సవ పోస్టర్ ను మంగళవారం వేములవాడలో రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వివిధ ప్రజా సంఘాలను రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు.అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ,సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత టీజేఎఫ్ దక్కిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, ఎలక్ట్రానిక్ మీడియా టెంజు అధ్యక్షులు ఇరుకుల ప్రవీణ్, సీనియర్ పాత్రికేయులు గరుదాసు ప్రసాద్, సయ్యద్ అలీ,దేవరాజ్, దెబ్బేటి ప్రవీణ్, నాగరాజు, ప్రసాద్, సాయి, సోహెల్, హరీష్, జబ్బార్, తో పాటు పెద్ద ఎత్తున జర్నలిస్టులతోపాటు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పేదలకు వరం



రామారెడ్డి :అమృత్ తెలంగాణ: గత పది సంవత్సరాల నుండి పేదల సొంతింటి కల సహకారం కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల తో కళా సహకారమవుతుందని, ఇందిరమ్మ ఇంట్లో పేదలకు వరం అని కాంగ్రెస్ నాయకులు గంగావత్ రవీందర్ మంగళవారం అన్నారు. మండలంలోని స్కూల్ తండాలో ఇందిరమ్మ ఇండ్లకు ముహూర్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భాస్కర్, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి,కాంగ్రెస్ నాయకులు బోజు నాయక్, సంతోష్ నాయక్, మోహన్, రెడ్డి, చందర్, తాండవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముధోల్ తహశీల్దార్ గా శ్రీలత




ముధోల్ :అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ తహశీల్దార్ గా శ్రీలత మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇదివరకు పనిచేసిన తహశీల్దార్ శ్రీకాంత్ నర్సాపూర్ కు బదిలీ పై వెళ్లారు. దీంతో ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన తహశీల్దార్ శ్రీలత కు నిర్మల్ జిల్లా కు కేటాయించారు. బదిలీల్లో భాగంగా ముధోల్ కు వచ్చారు . బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ శ్రీలతకు ముధోల్ ఆర్ఐ నారాయణ రావు పటేల్, ఆర్ఐ 2 సరస్వతి,మండల సర్వేయర్ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, వీఆర్ఏలు, కార్యాలయం సిబ్బంది పూల బోకెతో స్వాగతం పలికారు. ముధోల్ మండలంలోని నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కారాన్ని కృషి చేస్తానని తహశీల్దార్ పేర్కొన్నారు.

# ప్రజల అభీష్టం మేరకు ముంబై కు లహరి ఏసి స్లీపర్ బస్సు సర్వీసు: మంత్రి పొన్నం



వేములవాడ :అమృత్ తెలంగాణ: ప్రజల అభీష్టం మేరకు ముంబై కు లహరి స్లీపర్ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం వేములవాడ చెరువు కట్ట గుడి ప్రాంగణం వద్ద వేములవాడ నుంచి ముంబై వరకు వెళ్లే రెండు ఏసీ బస్సులను రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ,ఎస్పి మహేష్ బి.గీతే,లతో కలిసి పూజ చేసి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు మే 20 నుంచి వేములవాడ నుండి ముంబై వెళ్ళెందుకు ఏసీ స్లిపర్ బస్సు లహరి సర్వీసులను ప్రారంభిస్తున్నామని అన్నారు. 2 లహరి సర్వీస్ ఏసీ బస్సులను ముంబై సర్వీస్ నిమిత్తం కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు.ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వేములవాడ నుండి బయలు దేరి తెల్లారి ఉదయం 4.45 గంటలకు ముంబై కు చేరుకుంటుందని, అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ముంబై నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు వేములవాడ చేరుకుంటుందని తెలిపారు. ప్రతిరోజు ముంబై నగరానికి అప్ అండ్ డౌన్ సర్వీస్ నడుస్తుందని అన్నారు.

లహరి బస్సు సర్వీస్ లో 22 సీట్స్, 20 స్లిపర్ బెర్త్ లు ఉన్నాయని, ప్రతి సీటుకు చార్జింగ్ పాయింట్, ఏసి అడ్జెస్ట్ మెంట్ సౌకర్యం ఉందని, వైఫై సౌకర్యం బస్సులో కల్పించామని, సిసి కేమేరాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వేములవాడ నుంచి ముంబైకు పెద్దలకు స్లీపర్ బెర్త్ కు 2 వేల రూపాయలు, సీటు 1500 రూపాయలకు, పిల్లలకు బెర్త్ 1600, సీట్ 1230 రూపాయలకు టికెట్ ఉంటుందని , పట్టణ వాసులు ఈ సర్వీసు ను వినియోగించుకోవాలని మంత్రి కోరారు. ముంబై లో ఉన్న తెలంగాణ బిడ్డల ప్రయాణంకి ఇబ్బంది కలగవద్దని అక్కడి ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు బస్సు ప్రారంభం చేసుకున్నామనీ,ఈ బస్సు నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ప్రశంసించారనీ రాబోయే కాలంలో జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్ కి ప్రతి పుణ్యక్షేత్రం నుండి బస్సులు వేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయనీ మంత్రి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వం లో మహిళలకు మహా లక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం తో పాటు ఈపథకం విజయవంతం కావడానికి కష్టపడుతున్న ఆర్టీసీ డ్రైవర్ లు ,కండక్టర్ కు ,సిబ్బంది సంక్షేమానికి కట్టుబడుతూనే సంస్థ అభివృద్ధి దిశగా పని చేస్తున్నామని,ఆర్టీసీ లో కొత్త నియామకాలు ,కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

అంతకుముందు మంత్రి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో రాజన్న స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్సు ప్రారంభించిన అనంతరం ఆలయ ప్రాంగణం నుండి వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ వరకు అదే బస్సులో ప్రయాణించీ ముంబై వెళ్ళే ప్రయాణికులకు, పట్టణ ప్రజలకు స్థానిక ప్రజలకు ముంబై లో ఉన్న తెలుగు వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్పి శేషాద్రిని రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఏఎంసీ చైర్మన్ రాజు, ప్రజా ప్రతినిధులు , ఆర్టీసీ రీజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లు,ప్రజలు, ప్రయాణికులు సంబంధిత అధికారులు, తో పాటు తదితరులు ఉన్నారు.

# యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ గోవింద్ తన సిబ్బంది ఆధ్వర్యంలో గంజాయికి అలవాటు పడిన యువతకు తల్లిదండ్రుల సమక్షంలో టాస్క్ ఫోర్స్ ఆఫీస్ యందు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు, యువత గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు కానీ, పిల్లలు కానీ, తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిస అయినట్లయితే వారిని డి అడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి మత్తు పదార్థాలను మానిపించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. గంజాయి మరియు ఇతర నిషేధితమత్తు పదార్థాలు పెంచిన, స్వీకరించిన, రవాణా చేసిన వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. మాదక ద్రవ్యాలను అరికట్టడం లో ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని సూచించారు. గంజాయికి బానిసలుగా మారి యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకొంటుందని దాని వలన వారి జీవితాలు విచ్ఛిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురైవుతున్నారని, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడుతాయని, గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు.

# విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి: ఎంఈఓ ఆనంద్ రావు



రామారెడ్డి :అమృత్ తెలంగాణ: విద్య ప్రమాణాలు మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా విలువైనదని మంగళవారం మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు అన్నారు. మండలంలోని మానవ వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు మండల స్థాయి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ.. ఎఫ్ ఎల్ ఎన్ బోధన విధానాలు, మౌలిక సామర్థ్యాల సాధన, కనీస అభ్యాసన సామర్థ్యాల సాధన, సంసిద్ధత పాఠాల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులకు వివరించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, ఎల్లయ్య, శివకృష్ణ, ప్రశాంత్, పురం శ్రీ నివాస్, జోష్ణ దేవి, సీఆర్పీలు మహమ్మద్, సురేఖ, యుగేందర్, ఎం ఐ ఎస్ అజీమ్, మౌనిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శృతి మించుతున్న ఇందిరమ్మ ఇండ్ల గోల

ఖమ్మం : అమృత్ తెలంగాణ: ఇందిరమ్మ ఇండ్ల గోల శృతి మించుతోంది. ఇందిరమ్మ కమిటీల మితిమీరిన జోక్యంతో లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత లోపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రమేయం అధికమవుతోంది. గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెబుతున్న దానికి భిన్నంగా క్షేత్రస్థాయిలో ఎంపికలు జరుగుతున్నాయి. కఠిక పేదలు, నిరుపేదలు, పేదలు.. ఇలా విడతలవారీగా ఎంపికలు ఉండాలని ఆయన సూచిస్తున్నారు. కానీ ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఇష్టా అయిష్టాల ముందు అవేవీ పనిచేయటం లేదు. కమిటీలో సభ్యులకు నచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ నచ్చకపోతే దూరం పెడుతున్నారు. లబ్దిదారుల ఎంపికలో కులం, మతం, పార్టీలు చూడమని మంత్రి ప్రకటిస్తున్నా.. అవేవీ ఆచరణకు నోచుకోవటం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి జాబితాలో 562 గ్రామాల పరిధిలో 70,122 ఇండ్లకు అనుమతి ఇచ్చారు. ఇందులో 46,432 ఇండ్లకు మంజూరు పత్రాలు అందాయి. 17వేల మంది ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. వీటిలో 4,500 ఇండ్ల పునాది పూర్తయినట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇలా పునాది పూర్తయితే మొదటి దశలో రూ.లక్ష మంజూరు చేస్తారు. కాబట్టి అప్‌లోడ్ చేసిన వివరాలను అధికారులు ఏఐ సాంకేతికతతో జల్లెడ పడుతున్నారు. ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాను ఇన్‌చార్జి మంత్రి సంతకం చేయాల్సి ఉంటుంది. ఈలోపు గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవోలు సర్వే చేయాలి. కానీ ఈ ప్రక్రియలో రాజకీయ జోక్యం అధికమవుతుండటం అధికారులకు కూడా తలనొప్పిగా మారింది.

ఎవరి లిస్టు వారిదే..!

రాష్ట్రంలో అనేక చోట్ల బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ ఇతరత్ర పార్టీల నుంచి పలువురు నాయకులు ఎన్నికల ముందు, ఆ తర్వాత అధికార పార్టీలో చేరారు. అప్పటికే పార్టీలో ఉన్న పాత కాంగ్రెస్ నేతలు పలు చోట్ల ఉనికి కోల్పోయారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ కాంగ్రెస్‌లో మూడు, నాలుగు వర్గాలున్నాయి. నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే అనుచరులు కొందరుంటే.. అక్కడ పేరున్న నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మంత్రి, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే వర్గీయులు కొందరున్నారు. ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలో ఏ మంత్రికి ఆ మంత్రి వర్గాలున్నాయి. వీరిలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో చోటు లభించిన వారు ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. వర్గాల వారీగా తమ ఆధిక్యతను చాటుకోవాలనే రీతిలో ఎంపికలు చేయిస్తున్నారు. ఎవరి జాబితా వారు సిద్ధం చేసుకొని అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ ఎమ్మెల్యే, లేదంటే నియోజకవర్గ ఇన్‌చార్జి, సంబం ధిత అధికారుల ముందు ఉంచుతు న్నారు. ఎవరి లిస్టు ఫైనల్ చేస్తే ఏ తంటా వస్తుందోనని అధికా రులు తలలు పట్టుకుంటున్నా రు. ఈ పరిస్థితుల మధ్య అనేక గ్రామాల్లో రాత్రికి రాత్రే జాబితాలు తారుమారవుతున్నా యి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదనే ముఖ్యమంత్రి రేవంత్‌రె డ్డి, మంత్రుల ప్రకటనలతో దరఖాస్తుదా రులంతా మొదటి జాబితాలోనే పేరు రావాలని ఆరాటపడుతున్నారు. ఆ తర్వాత కేటాయింపులు ఉంటా యో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ఆ ప్రాంతంలో ప్రభావితం చేయగల నేతలకు తృణమోపణమో ఇస్తున్నట్టు తెలుస్తోంది. మందు విందుల్లో కొందరు పసందు



చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినా జాబితాలో చోటు ఇవ్వని పరిస్థితి ఉంది. స్థానికంగా ఉన్న నాయకులు కొందరు చక్రం తిప్పుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

దరఖాస్తుదారుపై బూటుతో దాడి..

పినపాక నియోజకవర్గం మణుగూరులో ఇటీవల ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. మణుగూరు తహసీల్దార్ ఆఫీస్ ఎదుట అధికార పార్టీ నాయకులు చలపతి దరఖాస్తుదారున్ని తన బూటుతో బాదుతూ బూతులు లంకించుకున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అన్నారం గ్రామానికి చెందిన చలపతిపై శ్రీను అనే వ్యక్తి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని దాడి చేసుకునేంత వరకూ వచ్చింది. అనేక గ్రామాల్లో ఇలాంటి వివాదాలే నడుస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి.

పేర్లను తారుమారు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు

ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అన్ని అర్హతలున్నా తమకు నచ్చని పేర్లను తొలగించి.. మూడు, నాలుగు జాబితాల్లో రావాల్సిన పేర్లను మొదటి జాబితాలోనే చేర్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. స్వయంగా గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోనే ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవటం చర్చనీయాంశంగా మారింది. కూసుమంచి మండలం బోడియాతండా గ్రామపంచాయతీ బండమీద తండాకు చెందిన భూక్యా రాజేశ్ పేరు ఇందిరమ్మ లబ్దిదారుల మొదటి జాబితాలో ఉంది. గ్రామసభలో ఎంపిక చేసిన లిస్టులో ఆయన పేరు ఉన్నా ఆ తర్వాత రాజకీయ కారణాలతో తొలగించారు. గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల కమిటీ కుంట భూమి లేని రాజేశ్ పేరును తొలగించి మూడు నుంచి ఐదారు ఎకరాల భూమున్న రైతుల పేర్లను చేర్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ విషయాన్ని రాజేశ్ మీడియా దృష్టికి తీసుకురావడంతో అతన్ని బెదిరించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఓవైపు సెకండ్ లిస్టులో చేర్చుతామని చెబుతూనే.. మరోవైపు కేసు నమోదు చేయాల్సిందిగా గ్రామ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు మండల కాంగ్రెస్ ముఖ్యనాయకుని ద్వారా పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది.

# ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



భిక్కనూర్ : అమృత్ తెలంగాణ: భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు మండల స్థాయి శిక్షణ తరగతులు కార్యక్రమాన్ని ఎంఈఓ రాజా గంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు బోధన పద్ధతులు, ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులకు విద్యాబోధన శిక్షణ తరగతుల పై అవగాహన కల్పిస్తూ శిక్షణను తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# వెస్లినగర్ తండాలో ఆలయ 11 వ వార్షికోత్సవ వేడుకలు..



డిచ్ పల్లి : అమృత్ తెలంగాణ: జగదాంబ దేవి సేవాలాల్ మహారాజుల ఆలయం నిర్మించి నేటికీ 11 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా తాండ పెద్దలు, తాండవాసులు ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలయంలోప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెంట్రాజ్ పల్లి సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ భోదునపు నవీన్, రఘు తండా పెద్దలు హరిలాల్, మీసాల హరి, హరిచంద్, నాయకులు సురేష్, కిషన్, పవన్, వసంత్, అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# పిట్ట గోడ ఎక్కిన మస్త్ మస్త్ జవానీ



మరోవైపు అనన్యకు యూత్ లో ఉన్న క్రేజ్ దృష్ట్యా పాపులర్ బ్రాండ్స్ తన వెంట క్యూ కడుతున్నాయి. ఇప్పటికే పలు బ్రాండ్స్ కి అనన్య ప్రచారం చేస్తోంది. అందానికి అందం ప్రతిభతో యువతరం హృదయాలను గెలుచుకున్న బ్యూటీ అనన్య పాండే. బాలీవుడ్ లో నటవారసురాలిగా ఆరంగేట్రం చేసినా ఒక్కో సినిమాతో నటిగా పరిణతి చెందుతూ ఇప్పుడు సౌత్ లోను ఫాలోవర్స్ ని సంపాదించుకుంది. దేవరకొండ సరసన పాన్ ఇండియన్ మూవీ ఫ్లాపైనా కానీ, అనన్యకు క్రేజ్ తగ్గలేదు. సౌత్ నుంచి ఈ బ్యూటీని మరిన్ని ఆఫర్లు వరించనున్నాయి.. కానీ దానికి కొంత సమయం పట్టొచ్చు. మరోవైపు అనన్యకు యూత్ లో ఉన్న క్రేజ్ దృష్ట్యా పాపులర్ బ్రాండ్స్ తన వెంట క్యూ కడుతున్నాయి. ఇప్పటికే పలు బ్రాండ్స్ కి అనన్య ప్రచారం చేస్తోంది. ఏడాది ప్రచారానికి కోటి పైగా అందుకుంటోందని సమాచారం. ఇప్పుడు అలాంటి ఒక బ్రాండ్ ప్రచారంలో భాగంగా పిట్టగోడ ఎక్కి ఫోజులిచ్చింది. టైట్ ట్రాక్ ధరించి పిట్టగోడపై ఈ సన్నజాజి ఇచ్చిన ఫోజ్ ఇప్పుడు ఇంటర్నెట్ లో గుబులు రేపుతోంది. అనన్య ఫ్యాన్స్ ఈ ఫోటోగ్రాఫ్ ని వైరల్ గా షేర్ చేస్తున్నారు. అయ్యేదెప్పుడు బాస్! బ్రింజాల్ ట్రాక్ లో అనన్య ఒంపు సొంపులు ఒక రేంజులో ఎలివేట్ అయ్యాయంటే బోయ్స్ కితాబిచ్చేస్తున్నారు. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇటీవలే విడుదలైన కేసరి చాప్టర్ 2లో అనన్య పాండే నటనకు మంచి పేరొచ్చింది. బ్రిటీషర్ల పాలనలో జలియన్ వాలాబాగ్ దురంతం అనంతరం జరిగిన కోర్ట్ రూమ్ సన్నివేశాల్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారని ప్రశంసలు కురుస్తున్నాయి. కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ ఈ సినిమాని వీక్షించి ఇప్పుడు రివ్యూ ఇవ్వడం ఆసక్తి ని కలిగిస్తోంది. అక్షయ్ కుమార్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించారు.

# థై స్లిట్ గౌనులో నటి -క్లూజీవ్ భంగిమ


మంచు కాంపౌండ్ సినిమా మోసగాడులో నటించింది రూహీ సింగ్. బాలీవుడ్ టు టాలీవుడ్ ఈ భామ కాంటాక్ట్స్ ని మెయింటెయిన్ చేస్తోంది. మంచు కాంపౌండ్ సినిమా మోసగాడులో నటించింది రూహీ సింగ్. బాలీవుడ్ టు టాలీవుడ్ ఈ భామ కాంటాక్ట్స్ ని మెయింటెయిన్ చేస్తోంది. కానీ రూహీ మోడలింగ్ లో రాణించినంతగా సినిమాలతో రాణించలేదన్నది వాస్తవం. కింగ్ ఫిషర్ క్యాలెండర్ గర్ల్ గా ఫోటోషూట్లతో పాపులరైన రూహీ, ఆ తర్వాత బాలీవుడ్ లో మాధుర్ భండార్కర్ అటుపై వరస చిత్రాల్లో నటించింది. కానీ ఏవీ ఆశించిన సక్సెస్ ని ఇవ్వలేదు. .అయ్యేదెప్పుడు బాస్! చాలా కాలం తర్వాత టాలీవుడ్ లో మోసగాడు చిత్రంతో అడుగుపెట్టింది. రూహీ ఇప్పటికీ హిందీ, తెలుగు చిత్రాల్లో నటించాలని కలలు కంటోంది. కానీ ఆశించిన అవకాశాలేవీ వరించలేదు. రూహీ వెబ్ సిరీస్ లు, మ్యూజిక్ ఆల్బమ్స్ లోను నటించింది. కానీ ఇటీవల ఈ అవకాశాలు కూడా లేవు. ప్రస్తుతానికి మోడలింగ్ అసైన్ మెంట్స్ తో కాలం నెట్టుకొస్తున్న ఈ బ్యూటీ ఇన్ స్టా అభిమానులకు నిరంతర ట్రీట్ ని కొనసాగిస్తోంది. తాజాగా రూహీ రెడ్ హోలి లుక్ ఇంటర్నెట్‌లో వైరల్ గా మారింది. థై స్లిట్ ఫ్రాక్ లో రూహీ



రకరకాల భంగిమల్లో చెలరేగిపోయింది. తాజా ఫోటోషూట్ లో ఎక్స్ క్లూజివ్ థై స్లిట్ ఎలివేషన్ కి చెందిన ఫోటోగ్రాఫ్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ గా మారింది. అందాల రూహీ ఈ భంగిమలో చాలా హోలి గా, స్పెషల్ గా ఉందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. రూహీ 2023లో సోషల్ కరెన్సీ అనే వెబ్ సిరీస్ లో నటించింది. ఆ తర్వాత కొత్త ప్రాజెక్ట్ గురించిన ఎలాంటి సమాచారం రాలేదు.

# కథ విన్నప్పుడే ఆ విషయం ఫిక్సయ్యా

అయితే హిట్3 సినిమా మొదటి సీన్ నుంచి వయొలెన్స్ గా ఉండదని, అవసరమైన చోట మాత్రమే ఇందులో యాక్షన్ ఉంటుందని, కెజిఎఫ్ సినిమాలకు హిట్3 సినిమాకు చాలా తేడా ఉందని చెప్పింది. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కెజిఎఫ్1, కెజిఎఫ్2 సినిమాలతో మంచి ఫాలోయింగ్ సంపాదించిన శ్రీనిధి ఇప్పుడు టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన హిట్: ది థర్డ్ కేస్ సినిమాలో శ్రీనిధి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో శ్రీనిధి మీడియాతో మాట్లాడి పలు విషయాలను షేర్ చేసుకుంది. .అయ్యేదెప్పుడు బాస్! కెజిఎఫ్, కెజిఎఫ్2, ఇప్పుడు హిట్3 మూడూ సినిమాలూ హింసతో కూడుకున్నవేనని, కానీ తాను మాత్రం చాలా సాఫ్ట్ అని, వయొలెన్స్ ను తాను వద్దనుకున్నా, వయొలెన్స్ తనను వద్దనుకోవడం లేదని, అయితే హిట్3 సినిమా మొదటి సీన్ నుంచి వయొలెన్స్ గా ఉండదని,



అవసరమైన చోట మాత్రమే ఇందులో యాక్షన్ ఉంటుందని, కెజిఎఫ్ సినిమాలకు హిట్3 సినిమాకు చాలా తేడా ఉందని చెప్పింది. ఈ సినిమా కథ విన్నప్పుడే యాక్షన్ సినిమా అని అర్థమైందని, అప్పుడే ఈ సినిమాకు ఏ సర్టిఫికేట్ వస్తుందని అర్థమైందని, ఈ విషయంలో నానితో ఏ సర్టిఫికేట్ మూవీ చేయడానికి నీకు 16 ఏళ్లు పట్టింది కానీ నేను నాలుగో సినిమాతోనే ఈ ఫీట్ ను సాధించానని చెప్తుంటానని శ్రీనిధి తెలిపింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# చీరలో అయేషా అందం..



ఈ స్టిల్ మామూలుగా లేదు ఈ ఏడాది శ్రీవిష్ణు హీరోగా వచ్చిన ఓం భీమ్ బుష్ మూవీలో ఓ కీలక పాత్రలో అయేషా ఖాన్ నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లో గట్టిగా వినిపిస్తోన్న పేరు అయేషా ఖాన్. ఒక్క ఐటెం సాంగ్ తో టాలీవుడ్ లో విపరీతమైన క్రేజ్ ని ఈ బ్యూటీ సొంతం చేసుకుంది. మోడల్ గా, సోషల్ మీడియా ఇన్ ఫ్ల్యూన్సర్ గా కెరియర్ స్టార్ట్ చేసిన అయేషా ఖాన్ హిందీలో ఓ ఆల్బం సాంగ్ లో నటించింది. ముఖచిత్రం మూవీతో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఈ ఏడాది శ్రీవిష్ణు హీరోగా వచ్చిన ఓం భీమ్ బుష్ మూవీలో ఓ కీలక పాత్రలో అయేషా ఖాన్ నటించింది. ఈ పాత్రకి మంచి గుర్తింపు వచ్చింది. విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో ఐటెం సాంగ్ తో ఒక్కసారిగా అయేషా ఖాన్ అందరి కళ్ళు తనవైపు తిరిగేలా చేసుకుంది. ఆ సాంగ్ లో ప్రస్తుతం సోషల్ లో విపరీతంగా ట్రెండింగ్ అవుతోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com